సాక్షి మెదక్

శుక్రవారం । 10 । నవంబర్ । 2023

కాటాకే కాంగ్రెస్ టికెట్..



కాటా శ్రీనివాస్ గౌడ్

పటాన్‌చెరు: పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం విషయంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ టికెట్‌ను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు కేటాయిస్తూ హస్తం పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల క్రితం ఈ టికెట్‌ను నీలం మధు ముదిరాజ్‌కు ప్రకటించిన విషయం విదితమే. కానీ, ఆయనకు బీ ఫారం ఇవ్వలేదు. మరోవైపు నీలం మధుకు టికెట్ ప్రకటించడం పట్ల కాటా శ్రీనివాస్‌గౌడ్ వర్గం భగ్గుమంది. గాంధీభవన్‌ను రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ప్రకటించిన తుది జాబితాలో కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు కేటాయిస్తూ ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది.

న్యూస్‌రీల్

ఏడు నామినేషన్ల దాఖలు

నర్సాపూర్: నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు గురువారం ఏడుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. హత్నూర మండలం చీక్ మద్దూర్‌కు చెందిన గౌర్రె ప్రవీణ్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీధర్‌యాదవ్ తన రెండో సెట్‌ను, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి తన మూడో సెట్‌ను దాఖలు చేశారు. మాసాయిపేట మండలంలోని బొమ్మారం గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేయగా నర్సాపూర్‌కు చెందిన నవీన్‌కుమార్ ఇండిపెండెంట్‌గా తన రెండో నామినేషన్ సెట్‌ను దాఖలు చేశారు. అలాగే ఇండియా ప్రజాబంధు పార్టీ(ఐపీబీపీ) అభ్యర్థిగా గాజుల రామారంనకు చెందిన నర్సింలు నామినేషన్ దాఖలు చేయగా శిలాంపల్లికి చెందిన నారాయణరెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివరించారు.

ఇద్దరు అభ్యర్థులపై కేసులు

నర్సాపూర్: నామినేషన్‌వేసే క్రమంలో ఎన్నికల కమిషన్ విధించిన కోడ్‌ను ఉల్లంఘించిన ఇద్దరు అభ్యర్థులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. బుధవారం నర్సాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆవుల రాజిరెడ్డి నామినేషన్ వేశారు. నామినేషన్ వేసేందుకు ఆయన ర్యాలీగా వచ్చారని, ర్యాలీలో బాణసంచా పేల్చడం, అభ్యర్థి బొమ్మలతో ఉన్న టీ షర్టులు ధరించడం లాంటి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని ఎలక్షన్ ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆవుల రాజిరెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు. అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గాలిఅనిల్ కుమార్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని, ముందస్తు అనుమతి లేకుండా డీజే వినియోగించడం, అదనపు వాహనాలు వాడడం, అభ్యర్థి ఫోటోలు ఉన్న టీ షర్టులు ధరించడం లాంటి చర్యలతో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని ఎన్నికల అధికారి ఫిర్యాదు మేరకు ఆయనపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

పౌరుల ఆయుధం సీ విజిల్

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల నేపథ్యంలో పార్టీల అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీలు, వివిధ ప్రచారాలకు అనుమతుల కోసం సువిధా ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఎన్నికల ప్రచారాల్లో ఓటర్లను మభ్య పెట్టేందుకు చేపట్టే అక్రమాలపై , ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వారిపై సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయాలని, ప్రతి పౌరుడికి అది ఒక ఆయుధం లాంటిదన్నారు. అలాగే 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

పట్టుబడిన నగదు తిరిగి చెల్లింపు

జిల్లాలో ఫ్లయింగ్‌స్క్వాడ్ టీంల ద్వారా పట్టుబడిన రూ.1,37,88,870 నగదును తిరిగి చెల్లించినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా తెలిపారు. మిగిలిన వారు తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే తిరిగి చెల్లించడం జరుగుతుందని తెలిపారు. వివరాల కోసం జిల్లా గ్రీవెన్స్ కమిటీ జిల్లా అధికారులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ 9281484100, జిల్లా ఆడిట్ అధికారి రాకేశ్ 9948213828, జిల్లా ట్రెజరీ అధికారి జిల్లా చిన్న సాయిలు 779934150లను సంప్రదించాలని కోరారు. వ్యయ పరిశీలకుడి కార్యాలయం గతంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఉండగా, ప్రస్తుతం ఐడీఓసీ అధికారుల గృహ సముదాయం సూట్‌నెం.1లోకి మార్చారని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ పూర్తి అయ్యేవరకు అందుబాటులో ఉండి ఫిర్యాదులు, వినతులను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- జూనియర్ సివిల్ జడ్జి అనిత



మాట్లాడుతున్న న్యాయమూర్తి అనిత

నర్సాపూర్‌రూరల్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జ్ అనిత సూచించారు. గురువారం జాతీయ న్యాయసేవా అధికార సంస్థ దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సాపూర్ పోస్టు మెట్రిక్ గరల్స్ హాస్టల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జ్ అనిత పాల్గొని పిల్లలకు జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ప్రాముఖ్యత, భారత రాజ్యాంగ హక్కులను వివరించారు. చట్టాలపై అవగాహన కల్పించారు. సమస్యలు తలెత్తినప్పుడు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా సలహాలు పొందవచ్చని తెలిపారు. నర్సాపూర్ ఏఎస్‌ఐ సుందర్‌రాజు, లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చేతిలోనే సురక్షితం



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

సమర్థ నాయకుడు.. సుస్థిర ప్రభుత్వం

- టిక్కెట్లను అమ్ముకున్న కాంగ్రెస్
- మంత్రి హరీశ్‌రావు ధ్వజం

మెదక్: పుట్టిన పసిగుడ్డు తల్లి చెంత ఎంత పదిలమో.. ఎదుగుతున్న తెలంగాణ సీఎం కేసీఆర్ చేతిలో అంతే సురక్షితం అని, ఏబుల్ లీడర్, స్టేబుల్ గవర్నమెంట్ కేసీఆర్‌తోనే సాధ్యమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం ఆయన మెదక్‌లో జరిగిన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరెన్ని గిమ్మిక్కులు చేసినా మెదక్‌లో పద్మ గెలుపు, రాష్ట్రంలో కేసీఆర్ గెలుపును ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఏంకావాలో ఆలోచించే వ్యక్తి అని, ఆయన ఉండగా ఇతర పార్టీలకు ఓటు వేసి ఎందుకు రిస్క్ తీసుకోవాలని ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ గతంలో అధికారంలోఉన్న రాష్ట్రాల్లో నేడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సైతం ఎక్కడా సంక్షేమ పథకాలను తెలంగాణ తరహాలో అమలు చేయలేదన్నారు. ఆసరా పెన్షన్ పెంచాలన్నా, రైతుబంధు పెంచాలన్నా, కల్యాణ లక్ష్మి కావాలన్నా, ప్రజలకు తాము ఇవ్వగలుగుతామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు ఏది కావాలన్నా ఢిల్లీకి పోవాలని ఎద్దేవా చేశారు. ఢిల్లీ పార్టీలను నమ్ముకొని మోసపోవాల్సిన అవసరం మన ప్రజలకు లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు టికెట్లను అమ్ముకుంటున్నారని, అలాంటి వారి చేతిలో రాష్ట్రాన్ని పెడితే కుక్కలు చింపిన విస్తరాకు అవుతుందన్నారు.

కేసీఆర్ అడుగులో అడుగేసి..

సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రజల కష్ట సుఖాలు తెలిసిన వ్యక్తి అని, ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ అడుగులో అడుగువేసి రాష్ట్ర సాధనలో అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తుల్లో ఆమె ఒకరని మంత్రి కొనియాడారు. మెదక్ అభివృద్ధి జరగలేదని ప్రతిపక్షనేత పేర్కొనడం కనీస పరిజ్ఞానం లేకపోవడమేనని పరోక్షంగా కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌రావును ఉద్దేశించి మాట్లాడారు. మెదక్ నియోజకవర్గంలో కనీసం ఎన్ని గ్రామాలు ఉన్నాయో తెలియని వ్యక్తి పద్మను విమర్శించడం హాస్యాస్పదం అన్నారు. కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి హరీశ్‌రావు కోరారు. ఆయన వెంట ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు చంద్రపాల్, మల్లికార్జున్‌గౌడ్, మామిళ్ల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఉప్పొంగిన ఉత్సాహం

బీఆర్‌ఎస్ అధినేతకు నీరాజనం

- నామినేషన్ వేసేందుకు వచ్చిన కేసీఆర్‌కు ఘన స్వాగతం
- హెలికాప్టర్‌లో వచ్చి పత్రాల సమర్పణ

గజ్వేల్: నామినేషన్ వేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. నియోజకవర్గంలోని గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, మర్కూక్, కొండపాక, కుకునూర్‌పల్లి, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. వేలాది బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత హెలిపాడ్ కోసం ఏర్పాటు చేసిన హౌసింగ్ బోర్డు మైదానం వద్దకు చేరుకున్నారు. సీఎం ఎర్రవల్లి ఫాం హౌస్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11గంటల ప్రాంతంలో హౌసింగ్ బోర్డు మైదానానికి చేరుకున్నారు. సీఎంకు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. కేసీఆర్ సమీప బంధువు మాజీ జెడ్పీ చైర్మన్, సీనియర్ నాయకులు లక్ష్మీకాంతారావు, ప్రతాప్‌రెడ్డి తదితరులు ప్రత్యేక వాహనంలో ఆర్‌డీఓ కార్యాలయానికి చేరుకుని కేసీఆర్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి బన్సీలాల్‌కు అందజేశారు. పత్రాలను పరిశీలించిన తర్వాత అధికారులు కేసీఆర్‌తో ఎన్నికల ప్రతిజ్ఞ చేయించారు.

తగ్గేదేలే..!



- టిక్కెట్ ఆశించి భంగపడిన ఆశావహులు
- నామినేషన్ వేసిన కాంగ్రెస్, బీజేపీ అసమ్మతి నేతలు
- ఉత్కంఠగా మారిన అధిష్టానాల నిర్ణయం
- రెబల్స్ లేకుండా బీఆర్‌ఎస్ జాగ్రత్తలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: టికెట్ల కోసం చివరి వరకు ప్రయత్నించి భంగపడిన ఆశావహులు తగ్గేదేలే అంటున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులకు దీటుగా నామినేషన్లు వేస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీల్లో ఈ పరిస్థితి నెలకొంది. నారాయణఖేడ్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కోసం పీసీసీ ఉపాధ్యక్షుడు సురేష్‌షెట్కార్, డాక్టర్ సంజీవరెడ్డి అన్ని ప్రయత్నాలు చేశారు. కానీ, చివరకు అధిష్టానం షెట్కార్ వైపు మొగ్గు చూపింది. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన సంజీవరెడ్డి. తన ముఖ్య అనుచరులతో సమావేశమై బరిలోకి దిగాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. టికెట్ దక్కిన షెట్కార్ కూడా నామినేషన్ వేశారు. ఇటు పటాన్‌చెరులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నర్సాపూర్‌లోనూ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు ఇద్దరు నామినేషన్ వేయడం రసవత్తరంగా మారింది. ఈ టికెట్ ఆవుల రాజిరెడ్డికి దక్కగా ఆయన నామినేషన్ వేశారు. ఈ అభ్యర్థిత్వం కోసం గాలి అనిల్‌కుమార్ కూడా బరిలోకి దిగాలని భావిస్తున్నారు. బుధవారం తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఆవుల రాజిరెడ్డికి ఇచ్చిన బీ-ఫారం రద్దు చేసి, తనకు సీ-ఫారం ఇస్తుందని గాలి అనిల్‌కుమార్ ప్రకటించడం ఆసక్తికరంగా మారింది.

బీఆర్‌ఎస్‌కు తప్పిన రెబల్ బెడద

బీఆర్‌ఎస్ పార్టీ రెబల్ అభ్యర్థుల కిరికిరి లేకుండా చూసుకుంది. ఉమ్మడి జిల్లాలో పలు స్థానాలకు ఇద్దరు, ముగ్గురు బీఆర్‌ఎస్ టిక్కెట్లు ఆశించారు. పలుచోట్ల టిక్కెట్లు దక్కని నేతలు తీవ్ర అసమ్మతిని వ్యక్తం చేశారు. సంగారెడ్డి, నర్సాపూర్, జహీరాబాద్ తదితర చోట్ల అసమ్మతి రాగం ఆలపించిన నేతలందరిని ఆ పార్టీ అధినాయకత్వం ఆదిలోనే బుజ్జగించింది. రెండు నెలల క్రితమే టికెట్లను ప్రకటించిన గులాబీ పార్టీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ తేదీ వరకు ఎక్కడా అసమ్మతి లేకుండా జాగ్రత్త పడింది. నామినేషన్ల గడువు ముగిసే నాటికి కూడా ప్రత్యర్థి పార్టీల్లో అసమ్మతి సెగలు రగులుతుంటే బీఆర్‌ఎస్‌లో మాత్రం ఆయా చోట్ల ఐక్యతా రాగాన్ని ఆలపిస్తున్నారు.

బుజ్జగింపులకు లొంగుతారా?

కాంగ్రెస్, బీజేపీల టికెట్లు దక్కనప్పటికీ నామినేషన్లు వేసిన అసమ్మతి నేతలు చివరి వరకు బరిలో ఉంటారా? లేక ఆయా పార్టీల అధినాయకత్వం బుజ్జగింపులకు లొంగుతారా? అనే తేలాల్సి ఉంది. కాంగ్రెస్‌లోని అసమ్మతి నేతలను ఆ పార్టీ అధినాయకత్వం బుజ్జగిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ రెబల్ అభ్యర్థులు చివరి వరకు పోటీలో కొనసాగుతారా? లేక తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటారా? అనేది నామినేషన్ల ఉపసంహరణ 15వ తేదీన తేలనుంది.

బీజేపీలోనూ ఇదే తీరు

ఒకటీ రెండు స్థానాల్లో బీజేపీలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. సంగారెడ్డి టికెట్‌ను ఆశించిన రాజేశ్వర్ రావు దేశ్‌పాండే, పులిమామిడి రాజు ఇద్దరూ గురువారం నామినేషన్లు వేయడం బీజేపీలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ టికెట్‌పై అధినాయకత్వం ఇంకా నిర్ణయాన్ని ప్రకటించలేదు. అయినప్పటికీ ఇద్దరూ బీజేపీ తరపున నామినేషన్లు దాఖలు చేయడం ఆసక్తికరంగా మారగా, బీ-ఫారం ఎవరికి దక్కుతుందోనని కమలం పార్టీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

63 నామినేషన్లు దాఖలు



నామినేషన్ వేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సంగారెడ్డి: జిల్లాలో అత్యధికంగా 63 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ గురువారం తెలిపారు. ఆరో రోజు నారాయణఖేడ్ నియోజకవర్గంలో 15, అందోల్ నియోజకవర్గంలో ఎనిమిది, జహీరాబాద్ నియోజకవర్గంలో 11, పటాన్‌చెరు నియోజకవర్గంలో 13, సంగారెడ్డి నియోజక వర్గంలో 16 నామినేషన్లు దాఖలైనట్లు పేర్కొన్నారు.

సాదాసీదాగా 'చింతా' నామినేషన్

బీఆర్‌ఎస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి చింతా ప్రభాకర్ నిరాడంబరంగా గురువారం నామినేషన్ వేశారు. సంగారెడ్డిలోని ఆర్డీఓ కార్యాలయంలో ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తరపున టీఎన్జీఓల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్ మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి అందాయన్నారు. తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, పిల్లల మృతి

ప్రాణాలతో బయటపడిన చిన్నారి



తల్లి మలైక, కుమారుడు అద్నాన్(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): తల్లి, ఇద్దరు కుమారులు, కుమారుడుతో కలిసి స్కూటీపై శుభకార్యానికి వెళ్లి ఇంటికి వస్తున్న క్రమంలో లారీ ఢీకొంది. దీంతో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. పాప మాత్రం ప్రాణాలతో బయటపడింది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాంనగర్‌కు చెందిన మహ్మద్ అహ్మద్ కూతురైన మలైక (30) రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని బాబాగూడలోని ఒక శుభ కార్యానికి తన పిల్లలతో కలిసి స్కూటీపై వెళ్లింది. శుభకార్యం ముగించుకుని తిరిగి మెదక్‌కు వస్తున్న క్రమంలో మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోని జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన ఒక లారీ అదుపు తప్పి వారి స్కూటీపై నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆమెతో పాటు ఇద్దరు పిల్లలు అద్నాన్, సుల్తాన అక్కడికక్కడే మృతి చెందారు. సీఐ శ్రీధర్, ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుల సంఘాలపై కన్ను



జిల్లా కేంద్రాల్లో ఆత్మీయసమ్మేళనాలు

- ఇప్పటికే పూర్తయిన ఆర్యవైశ్య, మున్నూరు, ఎరుకల సామాజిక వర్గాల సమావేశాలు
- ఆలయాలు, ఇతర భవనాలకు హామీలు
- విరివిగా విరాళాలు

మెదక్: ఎన్నికల నేపథ్యంలో గంపగుత్తగా ఓట్లు రాబట్టేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వ్యూహ, ప్రతి వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ఏ కులానికి, ఏ వర్గానికి ఎంత మంది ఓటర్లు ఉన్నారనే లెక్కలు పక్కాగా వేస్తున్నారు. కుల సంఘాల భవనాలకు స్థలాలు, విరాళాలు విరివిగా కేటాయిస్తున్నారు. హామీలు గుప్పిస్తూ ఓట్లు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు మెజారిటీ ఓట్లు ఉన్న వివిధ కులాలు, సంఘాల మద్దతు కూడగట్టడంపై దృష్టి సారిస్తున్నారు. ఎన్నికల్లో ప్రభావంచూపే సంఘాలతో ఆయా మండలాలు, గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల్లో తమకు మద్దతివ్వాలని, అన్ని విధాలా అండగా ఉంటామని వారికి భరోసా ఇస్తున్నారు. ప్రధానంగా ఆయా ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో ఉన్న ముదిరాజ్, మున్నూరు కాపులు, రజక, ఎరుకల, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారితో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుని ఓట్లు రాబట్టుకునేందుకు పాట్లు పడుతున్నారు.

ఇప్పటికే పూర్తయిన పలు సమావేశాలు

బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఇప్పటికే పలు కుల సంఘాల నేతలతో ఆత్మీయ సమ్మేళనాలలో పాల్గొని మద్దతును కూడ గట్టుకున్నారు. మెదక్‌లో ఇటీవల ఆర్యవైశ్య, మున్నూరు కాపు, ఎరుకల సంఘాల ఆధ్వర్యంలో కృతజ్ఞత, ఆత్మీయ సమ్మేళనాలు, సభలు నిర్వహించారు. ఆర్యవైశ్య సభకు పద్మాదేవేందర్ రెడ్డి హాజరుకాగా, మున్నూరు కాపుసభకు ఎమ్మెల్యేతో పాటు మంత్రి గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర హాజరయ్యారు. ఆర్యవైశ్య, మున్నూరు కాపు సంఘాలకు మెదక్ పట్టణంలో స్థలాలు కేటాయించి భవనాల నిర్మాణాలకు రూ.కోటి చొప్పున నిధులు కేటాయించిన విషయాన్ని ప్రస్తావించి ఎన్నికల్లో మద్దతివ్వాలని కోరారు. అలాగే 8న మెదక్‌లో ఎరుకల ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకుడు సుతాడి నర్సింలు, ఉమ్మడి జిల్లా నాయకులు సత్యనారాయణ హాజరయ్యారు. సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి హాజరై మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన మైనార్టీ సమ్మేళనానికి రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, గిరిజన సమ్మేళనానికి గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయా వర్గాల అభివృద్ధి కోసం గడిచిన పదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించి బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థులు సైతం కుల సంఘాల మద్దతును కూడగడుతూ, ఆలయాల నిర్మాణాలతో పాటు సంఘాల భవనాలకు విరాళాలు ఇస్తామంటూ హామీలు గుప్పించారు.

బీజేపీ అభ్యర్థుల బీసీ నినాదం..

మరో పక్క బీజేపీ బీసీ నినాదం ముందుకు సాగుతోంది. మెదక్, నర్సాపూర్ స్థానాల్లో భారతీయ జనతాపార్టీ బీసీ అభ్యర్థులకు టికెట్లు కేటాయించింది. జనాభాలో అత్యధికులైనా బీసీ నేత సీఎం కావడంలేదని, మెదక్, నర్సాపూర్ బరిలో ఉన్న బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీకి చెందిన అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో బీసీలు అధికంగా ఉన్నారని, మెదక్ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్, నర్సాపూర్ అభ్యర్థి మురళీయాదవ్ ఎన్నికల ప్రచారంలో బీసీ నినాదంతో ముందుకు వెళుతున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు అగ్రవర్ణాలకు చెందిన వారేనని, బీసీల సమస్యలు తీరాలన్నా, అభివృద్ధి చెందాలన్నా రాజ్యాధికారంతోనే సాధ్యమవుతుందని వారు ప్రచారంలో అగ్రవర్ణాలను తీవ్రస్థాయిలో విమర్శిస్తూ ఆయా బీసీ సంఘాల మద్దతు కూడ గట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

హరీశ్ చెప్పినవన్నీ అబద్ధాలే...

- ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): దుబ్బాకలో మంత్రి హరీశ్‌రావు చెప్పినవన్నీ అబద్ధాలే అని ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. మంత్రి హోదాలో దుబ్బాకకు ఏంచేశారో చెప్పాలని సవాలు విసిరారు. చేగుంటలో రుక్మాపూర్, వడియారం గ్రామ వార్డు మెంబర్లకు ఆయన గురువారం కండువాకప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి మంత్రిగా ఉన్న హరీశ్‌రావు దుబ్బాకకు ఎన్ని నిధులు తెచ్చారో ప్రజలకు చెప్పగలరా అని ప్రశ్నించారు. రుక్మాపూర్ ఉపసర్పంచ్ రాంచంద్రం, వార్డు సభ్యులు, కోఆప్షన్ మెంబర్‌లు, వడియారం వార్డుమెంబర్ నర్సింలు బీజేపీలో చేరినవారిలో ఉన్నారు.

ఎదుల్లాపూర్‌లో విదేశీయుల పర్యటన

శివ్వంపేట(నర్సాపూర్): ఎదుల్లాపూర్, చిన్న గొట్టుముక్కల గ్రామాల్లో అమెరికా ప్రతినిధులు పర్యటించారు. గ్రామంలో సెగల్ స్వచ్ఛంద సంస్థ, పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వారు గురువారం పరిశీలించారు. వారు తుర్కవాణికుంటతో పాటు ప్రకృతివనం, గ్రామ పరిసరాలు పరిశీలించారు. వారు నిధులు ఇచ్చి ప్రోత్సహిస్తారని సెగల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్ కీర్తనహన్మంత్‌రావు సన్మానించారు. రాఘవేంద్ర భట్టచార్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సోనియా రుణం తీర్చుకుందాం : ఆంక్షారెడ్డి

మర్కూక్‌(గజ్వేల్‌): తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ సోనియమ్మ రుణం తీసుకునే సమయం వచ్చిందని, కేసీఆర్‌ కుటుంబ పాలనకు స్వస్తి చెప్పాలని యువజన కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పాతూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు మరిచారని, కేసీఆర్‌ కుటుంబ పాలనకు పట్టం కట్టారని, బీఆర్‌ఎస్‌ పాలనలో ఎవరికి న్యాయం జరగలేదన్నారు. ప్రతీ ఒక్కరూ చేతి గుర్తుకు ఓటేసి నర్సారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కనకయ్యగౌడ్‌, సర్పంచ్‌ తిరుమలరెడ్డి, నాయకులు యాదగిరి, నర్సింలు, భిక్షపతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్‌

అక్కన్నపేట(హుస్నాబాద్‌): అక్కన్నపేట మండలం రామవరం, కట్కూర్‌ గ్రామాల్లో గురువారం మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్‌ లక్ష్మీకాంతరావు తన కుమారుడు బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ గెలుపు చారిత్రక అవసరమని, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి బీఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యులు భూక్య మంగ, గ్రామ సర్పంచులు వనపర్తి స్వప్ననరేశ్‌, జిల్లెల అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లింగాల శ్రీనివాస్‌, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మాలోతు భీలునాయక్‌, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు : పొన్నం

- బీఆర్‌ఎస్‌, బీజేపీ రెండూ ఒక్కటే

అక్కన్నపేట(హుస్నాబాద్‌): హుస్నాబాద్‌ నియోజకవర్గ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని కాంగ్రెస్‌ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ గౌడ్‌ అన్నారు. అక్కన్నపేట మండలం దుబ్బతండా, రాజుతండా, వంకాయ తండా, కట్కూర్‌, చాపగానీతండా, కన్నారం, ఇచ్చులపల్లి, పంతుల్‌తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చాపగానీతండా గ్రామంలో కాసేపు గిరిజనులతో సరదాగా ముచ్చటించారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పనితీరుపై వారిని అడిగారు. బీఆర్‌ఎస్‌, బీజేపీ పార్టీలు రెండూ ఒక్కటే అని, కాంగ్రెస్‌ గెలవకుండా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. గ్రామాలకు బస్సు సౌకర్యం కూడా కల్పించని నాయకులను వెళ్లగొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అలాగే , ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికైన గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేకపోయారో..? ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌ విండో చైర్మన్‌ బొలిశెట్టి శివయ్య, అక్కన్నపేట సర్పంచ్‌ ముత్యాల సంజీవ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, నాయకులు బండి కుమార్‌, ధరావత్‌ తిరుపతి నాయక్‌, నూనావత్‌ మోహన్‌నాయక్‌, మాలోతు శ్రీనివాస్‌, రాజేందర్‌, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలది ఇంత దుర్మార్గమా..

- ప్రభాకర్‌ రెడ్డిపై మానవత్వం లేకుండా మాట్లాడారు
- ఈ జనాన్ని చూస్తే ప్రతిపక్షాల గుండెలు పేలిపోతాయి
- 50 వేల మెజార్టీతో ఆయన గెలుపు ఖాయం
- రాష్ట్రంలో బీజేపీ తుడిచి పెట్టుకుపోయింది.. కాంగ్రెసోళ్లు దద్దమ్మలు
- దుబ్బాక రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు


రోడ్‌ షో లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

దుబ్బాకటౌన్‌: ప్రభాకర్‌ అన్న మంచి వ్యక్తి.. కొంత మంది కుట్రపన్ని కత్తితో దాడి చేయించారు.. వైద్యులు నాలుగు గంటలకుపైగా సర్జరీ చేసి ప్రాణం కాపాడారు. ఇప్పటికీ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతుండు.. చావు బతుకుల్లో ఉంటే మానవత్వం లేకుండా ప్రతిపక్షాలు దుర్మార్గంగా మాట్లాడడం బాధాకరమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం దుబ్బాకలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా భారీ రోడ్‌ షో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి చౌరస్తాలో జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. ఈ జనాన్ని చూస్తే ప్రతిపక్షాల గుండెలు పేలిపోతాయి.. ప్రభాకరన్నది 50 వేల మెజార్టీతో గెలుపు ఖాయమైపోయిందన్నారు. మనది మంచి మేనిఫెస్టో మూడోసారి సీఎం అయ్యేది కేసీఆరే అన్నారు. తెలంగాణలో బీజేపీ తుడిచిపెట్టుకుపోయింది.. అడుగంటిన పార్టీకి ఓట్లేస్తే ఏం లాభం ఉండదు. ఉప ఎన్నికల్లో నూరు అబద్ధాలు ఆడి గెలిచిండు.. ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఎమ్మెల్యే రఘునందన్‌రావును విమర్శించారు. కాంగ్రెసోళ్లు దద్దమ్మలు అని వారికి ఓట్లేస్తే మళ్లీ మోసపోతామన్నారు.

దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ బాధ్యత నాదే..

దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటు బాధ్యత నాదే.. ప్రభాకరన్న గెలవగానే తప్పకుండా ఏర్పాటుతుందన్నారు. గులాబీ ఖిల్లా మెదక్‌ జిల్లాలో 10 స్థానాలు బీఆర్‌ఎస్‌ గెలుస్తుందన్నారు. ఈ నెల 26 న దుబ్బాకకు కేసీఆర్‌ వస్తుండు ఆ రోజు అందరు ఇళ్లకు తాళాలు వేసి తరలివచ్చి స్వాగతం పలకాలన్నారు.

రోడ్‌ షోలో ప్రభాకర్‌రెడ్డి..

రోడ్‌ షోలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అంబులెన్స్‌లోనే కొంత దూరం వరకు వచ్చారు. ఛత్రపతి శివాజీ చౌరస్తా నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు వచ్చారు. రోడ్‌షోకు భారీగా జనం తరలిరావడంతో వైద్యులు చికిత్సకు సమయం అవుతుందని ప్రభాకర్‌రెడ్డిని తీసుకెళ్లారు. ప్రభాకర్‌రెడ్డిని చూసేందుకు జనం ఎగబడ్డారు.

అభ్యర్థుల ఆస్తులు-అప్పులు

దుబ్బాకటౌన్‌: ఎన్నికల నామినేషన్‌లో భాగంగా ఆయా పార్టీల అభ్యర్థులు వారు సమర్పించిన అఫిడవిట్‌లో తమ ఆస్తులు, అప్పులకు సంబంధించి వివరాలు వెల్లడించారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ,ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి వ్యవసాయ భూములు, ప్లాట్స్‌, భవనాల ప్రస్తుత మార్కెట్‌ విలువ ప్రకారం ఆస్తులు రూ.84 కోట్ల 63 లక్షలు ఉన్నట్లు తన నామినేషన్‌ పత్రంలో సమర్పించిన అఫిడవిట్‌లో చూపించారు. అలాగే తన భార్య మంజులత పేరిట వ్యవసాయ, కమర్షియల్‌ ఆస్తులు రూ.96 కోట్ల 79 లక్షలు ఉన్నట్లు చూపించారు. అలాగే చేతిలో ప్రభాకర్‌రెడ్డి వద్ద రూ.1,72,500,మంజులత వద్ద రూ.80,650 ఉన్నాయి. కొత్త ప్రభాకర్‌రెడ్డి పేరిట బ్యాంకులో రూ.72,67,247,భార్య మంజులత పేరిట 47,73,365, ఇతర కుటుంబ సభ్యుల పేరిట 1,60,742 ఉన్నాయి. వివిధ కంపెనీలలో షేర్ల రూపేణ ప్రభాకర్‌రెడ్డి పేరిట రూ.7,24,84,608 ,మంజులత పేరిట రూ.9,41,46,459 ఉన్నాయి. ప్రభాకర్‌రెడ్డి పేరిట టయోటా ఫార్చునర్‌ వాహనం ఉంది, ఎలాంటి కేసులు లేవు. ప్రభాకర్‌రెడ్డి పేరిట బ్యాంకుల్లో రూ.5,88,91,271, మంజులత పేరిట 6,91,53,482 రుణాలు ఉన్నాయి.

మాధవనేని రఘునందన్‌రావు



బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు వద్ద రూ.2 లక్షల నగదు, భార్య మంజులదేవి వద్ద రూ.1.75 లక్షల నగదు ఉన్నట్లు నామినేషన్‌ పత్రాల్లో చూపించిన అఫిడవిట్‌లో చూపించారు. 140 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల విలువ జేసే డైమండ్‌ నెక్లెస్‌ ఉంది. డిపాజిట్లు వివిధ బ్యాంకుల్లో రూ.4,01,88,189, భార్య పేరిట రూ.10,586 ఉన్నాయి. వ్యవసాయ భూములు తన పేరిట బొప్పాపూర్‌లో 1.36 ఎకరాలు, భార్య పేరిట హబ్షీపూర్‌లో 5.17 ఎకరాలు, చేర్యాపూర్‌లో 0.2375 గుంటలు, రూ.3.6 విలువ జేసే 45,773 చదరపు గజాల స్థలం ఉంది. భార్య పేరిట పుప్పాలగూడలో రూ.8 కోట్ల విలువ జేసే విల్లా ఉంది. కేసులు 25 ఉన్నాయి. రుణంతో రూ.35 లక్షల విలువైన టయోటా ఫార్చునర్‌ ఉంది. రూ.4,40,50,000 అప్పులు, భార్య పేరిట గృహ రుణం రూ.3,00,88,067 ఉన్నట్లు చూపించారు.

చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



కాంగ్రెస్‌ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వద్ద రూ. 2 లక్షల నగదు, భార్య అర్పిత వద్ద రూ.లక్ష ఉన్నట్లు నామినేషన్‌ అఫిడవిట్‌లో చూపించారు. శ్రీనివాస్‌రెడ్డికి వివిధ బ్యాంకుల్లో డిపాజిట్లు రూ.35 లక్షలు, భార్య పేరిట 66,96,872 ఉన్నాయి. వ్యవసాయ భూములు, కమర్షియల్‌ ప్లాట్స్‌, భవనాల రూపంలో శ్రీనివాస్‌రెడ్డి పేరిట రూ.1,58,61,000, భార్య పేరిట 53.50లక్షలు ఉన్నాయి. ఎలాంటి కేసులు లేవు. ఇన్నోవా క్రిస్టా, టాటా నిక్సాన్‌ వాహనాలు . బంగారం 50 గ్రాములు, భార్య పేరిట 300 గ్రాములు ఉంది. శ్రీనివాస్‌రెడ్డి పేరిట వివిధ బ్యాంకుల్లో రూ.10.80లక్షల రుణాలు, భార్య పేరిట రూ.76.16 లక్షలు ఉన్నాయి.

దామోదర రాజనర్సింహ



జోగిపేట (అందోల్‌) : అందోల్‌ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్‌ అభ్యర్థి దామోదర్‌ రాజనర్సింహ స్థిర ఆస్తులు విలువ(భూములు, భవనాల విలువ) రూ. 8,08,50,000 ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు. ఇందులో ఆయన సతీమణి పద్మిని స్థిర ఆస్తుల విలువ రూ.27,49,62,760 పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు(లోన్లు) 3,25,12,210 కాగా, ఇందులో ఆయన సతీమణి పద్మిని పేరుతో ఉన్న అప్పులను రూ. 9,79,93,024 తెలిపారు. చరా ఆస్తులు రూ.76,27,312 ఉన్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ , వ్యవసాయేతర, భవనాలు, వాహనాలు ఏమి లేవని, జూబ్లీ హిల్స్‌ లో 539 చదరపు గజాల ఇల్లు మాత్రమే ఉందని అఫిడవిట్‌లో తెలిపారు. 2018 ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల విలువరూ. 5,50,00,000 ఉండగా.. అప్పులు రూ.3,34,80, 395 ఉన్నట్లు పేర్కొన్నారు. 2014లో స్థిర ఆస్తుల, లోన్లు లేవని, చరాస్తులురూ.22,75,199 ఉన్నట్లు పేర్కొన్నారు.

మాణిక్‌రావు



జహీరాబాద్‌: జహీరాబాద్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కె.మాణిక్‌రావు గురువారం ఎన్నికల రిటర్నింగ్‌ అధికారికి అందజేసిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు వెల్లడించారు. తనకు సొంత కారు లేదని, భార్య పేరిట రూ.లక్ష విలువ గల కారు ఉన్నట్లు వెల్లడించారు. చేతిలో రూ.లక్ష, తన భార్య వద్ద రూ.50 వేల ఉన్నట్లు పేర్కొన్నారు. తన పేరిట 6.33 ఎకరాలు, భార్య పేరిట 14.6 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తెలిపారు. రూ.10.12 లక్షల విలువ గల ఆస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. బంగారం తన వద్ద మూడు తులాలు, భార్య వద్ద 60 తులాలు ఉందన్నారు. స్వగ్రామం ఝరాసంగంతోపాటు జహీరాబాద్‌, హైదరాబాద్‌ ప్రాంతాల్లో 4,166.6 చదరపు అడుగులు, తన భార్య పేరిట 3892.5 చదరపు అడుగుల ఇల్లు, స్థలాలు ఉన్నట్లు పేర్కొన్నారు. చరాస్తులు రూ.48,54,494, తన భార్య పేరిట రూ.80,49,780 ఉన్నట్లు తెలిపారు. స్థిరాస్తులు రూ.1,03,85,709 ఉన్నట్లు, తన భార్య పేరిట రూ.2,30,62,450 ఉన్నట్లు వివరించారు. అప్పులు లేవన్నారు.

పల్లా తరఫున నామినేషన్‌


నామినేషన్‌ పత్రాలు అందిస్తున్న బాల్‌నర్సయ్య

చేర్యాల(సిద్దిపేట): బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తరఫున మరో సెట్‌ నామినేషన్‌ పత్రాలను గురువారం పార్టీ నాయకులు ఆర్వో మురళీకృష్ణకు అందజేశారు. పార్టీ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌ నర్సయ్య, జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు, మాజీ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గాడిపల్లి ప్రేమలతారెడ్డి ఆర్వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్‌ పత్రాలు అందజేశారు.



నందీశ్వర్‌ గౌడ్‌.. బుల్డోజర్ల సౌండ్‌

పటాన్‌చెరు టౌన్‌: బీజేపీ పటాన్‌చెరు అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్‌ నామినేషన్‌ సందర్భంగా గురువారం వినూత్నంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద కేంద్రమంత్రి రావు సాహెబ్‌ పాటిల్‌తో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్‌ కార్యాలయానికి బుల్డోజర్లతో ర్యాలీగా వచ్చి రిటర్నింగ్‌ అధికారికి నామినేషన్‌ పత్రాలను అందజేశారు.



మనసు దోచిన కుర్రకారు

మండలంలోని ముస్త్యాల గ్రామంలో గురువారం పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రచారం చేస్తుండగా ఓ చోట బాలుడు తన చిన్న కారుతో ఎదురయ్యాడు. అది చూసిన పల్లా బాలుడి వద్దకు వెళ్లి నీ కారు ఇస్తావా.. ప్రచారంలో వాడుకుంటా అంటూ బాలుడికి షేక్‌ హ్యాండ్‌ ఇచ్చాడు. దీంతో అందరి దృష్టి బాలుడి కారుపై పడింది. అలాగే ఆసరా పెన్షన్‌ ఇస్తూ పెద్ద కొడుకు వలె ఆసరవుతున్న కేసీఆర్‌ సార్‌ వెంటే మేమంతా ఉంటాము. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించి తీరుతామని ఓ అవ్వ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెవిలో చెప్పింది.

–చేర్యాల(సిద్దిపేట)

రూ.12.89 లక్షలు పట్టివేత

ఎన్నికల్లో భాగంగా వేర్వేరు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేస్తూ పోలీసులు గురువారం సుమారు రూ.12.89 లక్షల నగదు పట్టుకున్నారు. నిజాంపేటలో రూ.1.14లక్షలు, మనోహరాబాద్‌లో రూ.1.20లక్షలు, సిద్దిపేటలో రూ.5లక్షలు, కల్హేర్‌లో రూ.5.55 లక్షలు సీజ్‌ చేశారు.

కల్హేర్‌(నారాయణఖేడ్‌): బైక్‌పై తరలిస్తున్న రూ. 5.55 లక్షల నగదు పట్టుకున్నట్లు కల్హేర్‌ ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు. గురువారం మండలంలోని మాసాన్‌పల్లి ఎక్స్‌ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సిర్గాపూర్‌ మండలం ముబారక్‌పూర్‌కు చెందిన కీసర గౌతమ్‌ ఎలాంటి ఆధారాలు లేకుండా బైక్‌పై నగదు తీసుకెళ్తుండగా పట్టుకొని సీజ్‌ చేశామన్నారు. నగదును జిల్లా ఎన్నికల ఖర్చుల కమిటీ వద్ద జమ చేశామని తెలిపారు.

సిద్దిపేటఅర్బన్‌: ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న రూ. 5 లక్షలను సిద్దిపేట త్రీటౌన్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట త్రీటౌన్‌ ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. పొన్నాల వద్ద ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్‌టీ చెక్‌ పోస్టు వద్ద గురువారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా, హైదరాబాద్‌ నుంచి సిద్దిపేటకు వస్తున్న కారులో రూ. 5 లక్షలు గుర్తించినట్లు తెలిపారు. డబ్బులకు సంబంధించిన రసీదులు చూపించాలని కోరగా ఎలాంటి రసీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనాల పత్రాలతోపాటు సరైన రసీదులను వెంట ఉంచుకోవాలని ఎస్సై సూచించారు.

రూ.1.14 లక్షలు

నిజాంపేట(మెదక్‌): మండల కేంద్రంలోని నస్కల్‌ బస్టాండ్‌ సమీపంలో ఏర్పాటు చెక్‌ పోస్ట్‌ వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ రూ.లక్ష నగదు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీనివాస్‌ రెడ్డి మాట్లాడుతూ.. చెక్‌ పోస్ట్‌ వద్ద ఒక కారులో రూ. 1,14,050 లు పట్టుకున్నట్లు తెలిపారు. వీటికి సరైన పత్రాలు తీసుకొస్తే వాటిని తిరిగి ఇస్తామన్నారు. అలాగే, మాజీ మంత్రి జోగు రామన్న వాహనంను పోలీసులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీస్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

చిన్నశంకరంపేట(మెదక్‌): వాహనాల తనిఖీలో భాగంగా మండల కేంద్రంలో పోలీస్‌లు మద్యం పట్టుకొని కేసు నమోదు చేశారు. చందాపూర్‌ గ్రామానికి చెందిన అరిగే శ్రీకాంత్‌ ఇరవై లీటర్ల మద్యం తీసుకెళ్తుండగా, పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పేట ఎస్‌ఐ నారాయణ తెలిపారు.

కాళ్లకల్‌లో చెక్‌పోస్ట్‌ వద్ద..

మనోహరాబాద్‌(తూప్రాన్‌): ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్‌ చెక్‌ పోస్ట్‌ వద్ద తనిఖీలో పోలీసులు రూ.లక్ష నగదును పట్టుకున్నారు. కారులో హైదరాబాద్‌ ఆసిఫ్‌ నగర్‌కు చెందిన మూస రణదీర్‌ రూ.1,20,000 తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును పీఎస్‌ గజ్వేల్‌లో రిపోర్ట్‌ చేశామని, అవసరమైన పత్రాలను చూపించి నగదు తీసుకోవచ్చని సీఐ శ్రీధర్‌, ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.


నిజాంపేట(మెదక్‌): నగదు చూపుతున్న పోలీసులు


కల్హేర్‌(నారాయణఖేడ్‌): నగదు సీజ్‌ చేస్తున్న ఎస్‌ఐ

ఓటు జారి పో'కుండా'


కుమ్మరి చక్రం తిప్పుతున్న వనిత, కౌన్సిలర్లు

దుబ్బాక బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకర్‌ రెడ్డికి మద్దతుగా మున్సిపల్‌ పరిధిలోని దుంపలపల్లిలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గన్నె వనిత భూంరెడ్డి , వైస్‌ చైర్‌పర్సన్‌ అధికం సుగుణ బాలకిషన్‌ గౌడ్‌ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కుల వృత్తులు చేసుకునే వారి దగ్గరకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ.. వారి పనులను చేస్తున్నారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ వనిత దుంపలపల్లిలో కుమ్మరి చక్రం తిప్పి కుండలు చేసి కారు గుర్తుకు ఓటు వేసి కొత్త ప్రభాకర్‌ రెడ్డిని గెలిపించాలని కోరారు. –దుబ్బాక

బరువు మాది.. ఓటు మీది


బస్తాలు మోస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గిరిజన తండాల్లో గురువారం బీఆర్‌ఎస్‌ పార్టీ గిరిజన నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్దకు వెళ్లి మీ వడ్ల బస్తాలు మేము మోస్తాం.. మీ ఓటు మాత్రం బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

–అక్కన్నపేట(హుస్నాబాద్‌)

ఇస్త్రీ ఇరగదీస్తా..


ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి

బీజేపీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ సిద్దిపేట ఎమ్మెల్యే అభ్యర్థి దూది శ్రీకాంత్‌ రెడ్డి అన్నారు. గురువారం ఆయన సిద్దిపేట పట్టణంలో ప్రచారం ప్రారంభించారు. ఉదయం మార్నింగ్‌ వాకర్స్‌ ను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. తర్వాత పట్టణంలోని పలు కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ల్యాండ్రీ షాపులో ఇస్త్రీ చేశారు. ప్రచారంలో పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్‌ యాదవ్‌, కోడూరి నరేశ్‌, చెంది సత్యనారాయణ, గోనె మార్కండేయులు, అంబటిపల్లి శ్రీనివాస్‌, యాదన్‌ రావు, దాబ నరేశ్‌, పద్మ, లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు. –ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట)

బజ్జీ.. వావ్‌ జీ


బజ్జీలు వేస్తూ ప్రచారం చేస్తున్న పద్మావతి

ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్‌ పార్టీ అందోల్‌ ఎమ్మెల్యే సతీమణి పద్మావతి బజ్జీలు వేశారు. అందోల్‌ – జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో క్రాంతి కిరణ్‌కు మద్దతుగా పద్మావతి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళా కౌన్సిలర్లతో కలిసి గడప గడపకూ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. కారు గుర్తుకే ఓటు వేసి చంటి క్రాంతి కిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు.

–జోగిపేట (అందోల్‌)

ఓటర్ల మనసు 'దోసే'య్‌..


హోటల్‌లో దోశ వేస్తున్న హరికృష్ణ

కాంగ్రెస్‌ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు జరుగుతుందని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా తిరుగుతూ పార్టీ మేనిఫెస్టో వివరించారు. అలాగే, ఓ హోటల్‌లో దోశవేస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. కార్యక్రమంలో ఫిషర్‌మెన్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర కార్యదర్శి బాబేష్‌, తదితర నాయకులు పాల్గొన్నారు.

–సిద్దిపేటరూరల్‌